నిలిచిన నిర్మాణ పనులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని ఎక్సైజ్, లైబ్రరీ కార్యాలయం
- నిధుల లేమే ప్రధాన కారణం



బిచ్కుందలో నిలిచిపోయిన ఎక్సైజ్ కార్యాలయ భవనం పనులు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ కార్యాలయాలు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేక అధికారులు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో ఎక్సైజ్ కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం ఐదేళ్ల క్రితం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ సగం పనులు పూర్తి చేశారు. కేటాయించిన నిధులతో కార్యాలయం నిర్మాణానికి గిట్టుబాటు కావడం లేదని కాంట్రాక్టర్ రెండు అంతస్తులు స్లాబ్ వేసి అర్ధాంతరంగా పనులు ఆపేసి వెళ్లిపోయారు. ఐదేళ్ల నుంచి అతీగతీ లేక భవనం వృథాగా ఉంది. మండల కేంద్రంలో లైబ్రరీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు కేటాయించింది. నిధులు సరిపోకపోవడంతో భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. అదనపు నిధులు లేక రెండు సంవత్సరాల నుంచి లైబ్రరీ కార్యాలయం పనులు నిలిచిపోయాయి. అలాగే ఎల్లారం తండా, బిచ్కుందలో అంగన్‌వాడీ భవనానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. పెరిగిన స్టీల్, సిమెంట్, జీఎస్టీ, కూలీ చార్జీలతో గిట్టుబాటు కావడం లేదని రెండు సంవత్సరాల నుంచి కాంట్రాక్టర్లు భవనం పనులు మధ్యలోనే నిలిపేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించి అదనంగా నిధులు కేటాయించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

లైబ్రరీ కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. టైల్స్, వాష్‌రూం, కరెంటు, ఇతర బ్యాలెన్స్ వర్క్ కోసం అదనంగా నిధులు మంజూరు కావాలి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

– మధుసూదన్, పీఆర్ ఏఈ, బిచ్కుంద

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి క్రైం: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లింలకు రంజాన్ కానుకలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎంకే ముజీబొద్దీన్ చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని కులాల పేద ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వం తరఫున బట్టలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి సాయి సుధీర్, వైస్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యత

కామారెడ్డి టౌన్: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని హసన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ముస్లింలకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గోవర్ధన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల పండుగలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇందులో మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్ పర్సన్ ఇందూ ప్రియ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే భవిష్యత్



ప్రజలతో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీతోనే భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి, కన్‌కల్, దేమికలాన్ గ్రామాలలో సోమవారం సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, ఇతర పార్టీల నుంచి తండోప తండాలుగా వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



హన్మాజీపేట్‌లో కానుకలు పంపిణీ చేస్తున్న నేతలు



ఎల్లారెడ్డిలో .. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ మసీద్‌లో ముస్లింలకు మంజూరైన రంజాన్ కానుకలను ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డితో కలిసి హన్మాజీపేట్ సర్పంచ్ బోనాల సుభాష్ పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ షేక్ అక్బర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

కామారెడ్డి రూరల్: లింగాపూర్‌లో రంజాన్ కానుకలను బీఆర్‌ఎస్ నేతలు అందజేశారు. కౌన్సిలర్ సుగుణ, కామారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ బండారి నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ నేత షానూర్ ఉన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో రంజాన్ కానుకలను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తహసీల్దార్ అనిల్‌కుమార్ పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మద్నూర్, డోంగ్లీ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, శశాంక్ పటేల్, సర్పంచ్‌లు సురేష్, గఫార్, తదితరులున్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని షాదీఖానాలో రంజాన్ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్, తహసీల్దార్ సుధాకర్ ఉన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బూరుగుపల్లి, కాటేపల్లి గ్రామాలలో సోమవారం పశువైద్యాధికారి పండరీనాథ్ ఆధ్వర్యంలో సబ్సిడీపై పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పండరీనాథ్ మాట్లాడుతూ..పెరటి కోళ్ల ఒక యూనిట్‌కు 45 కోళ్లు ఉంటాయన్నారు. యూనిట్ ధర రూ.3,330 కాగా ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రూ.1,110 ఇస్తోందన్నారు. బూరుగుపల్లి గ్రామానికి 4 యూనిట్లు, కాటేపల్లిలో 2 యూనిట్లు ఇచ్చినట్లు వివరించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఖద్గాంలో సోమవారం ఎంపీపీ అశోక్ పటేల్ చేతుల మీదుగా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ధాన్యాన్ని దళారులను అమ్మకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించి లాభం పొందాలని కోరారు. సొసైటీ చైర్మన్ బాలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలకు డిమాండ్



కామారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాల భవనాల్లో అనుమతులు లేకుండా జేఈఈ, నీట్, పాలిసెట్ కోచింగ్ సెంటర్‌లను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, అనుభవం లేని అధ్యాపకులతో కోచింగ్ ఇప్పిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

గొర్రెల పెంపకందారులకు అండగా ప్రభుత్వం



ఘన్‌పూర్(ఎం)లో గొర్రెల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నర్సింగరావు

- ఎంపీపీ లోయపల్లి నర్సింగ రావు
- ఘన్‌పూర్(ఎం)లో గొర్రెల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మాచారెడ్డి: గొర్రెలు, మేకల పెంపకందారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అన్నారు. సోమవారం ఘన్‌పూర్(ఎం) గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.31.96 లక్షలతో గొర్రెలు, మేకల షెడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషులు తలదాచుకునేందుకు ఇళ్లు ఎంత అవసరమో, మూగజీవాలకు షెడ్లు, కొట్టాలు అంతే అవసరమని అన్నారు. ఆ మూగజీవాలతోనే గొర్రెల పెంపకందారుల మనుగడ కొనసాగుతుందన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకల పంపిణీతో పాటు వాటికి షెడ్ల నిర్మాణానికి పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డులు ఉన్న గొర్రెల పెంపకందారులకు షెడ్ల నిర్మాణానికి దశలవారీగా నిధులు విడుదల చేస్తుందన్నారు. డీఆర్‌డీవో సాయన్న, ఎంపీడీవో బాలక్రిష్ణ, ఘన్‌పూర్ సర్పంచ్ లత, ఉప సర్పంచ్ మల్లేశ్‌యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు దుబాయ్ మల్లేశ్‌యాదవ్, విండో చైర్మన్ పూల్‌చంద్‌నాయక్, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం



సమావేశమైన వైద్యులు, ప్రజాప్రతినిధులు

లింగంపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం జనని ఆరోగ్య సమితి కమిటీని ఎంపీపీ గరీబున్నిసాబేగం, సర్పంచ్ బొల్లు లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కమిటీతో పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో వసతుల రూపకల్పన, వైద్య సేవలు తదితర విషయాలు చర్చించి సమస్యలు పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. 7 పల్లె దవాఖానాలకు వైద్యులను నియమించినట్లు చెప్పారు. వీటి ద్వారా గ్రామీణ పేదలకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీటీసీ షమీమున్నీసాబేగం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నాగిరెడ్డిపేట: భారత్ గ్యాస్ గోదాంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు..



బిచ్కుందలో..

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో పలు చోట్ల అగ్నిప్రమాదాల నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. గ్యాస్ గోదాముల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. – ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/బిచ్కుంద

వెంటనే రెగ్యులర్ చేయాలి



నిజాంసాగర్ ఎంపీడీవో నాగేశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు



నాగిరెడ్డిపేటలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన జేపీఎస్‌లు

సాక్షి, నెట్‌వర్క్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పలు చోట్ల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 28 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తయినా ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయకపోవడం శోచనీయమన్నారు. అనంతరం ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు.



పెద్దకొడప్‌గల్‌లో..

క్లుప్తంగా

బీజేపీ బలోపేతమే లక్ష్యం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరుణతార అన్నారు. సోమవారం పోచారం తండాలో అరుణతార ఆధ్వర్యంలో పల్లె పల్లెకు ఓబీసీ- ఇంటింటి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి తెలియజేయాలని అన్నారు.

వాహనాల తనిఖీలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం చౌరస్తాలో సోమవారం ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. అక్రమ రవాణా అరికట్టేందుకు ఈ సోదాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి వాహనాదారుడు తప్పకుండా ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు దుస్తుల పంపిణీ



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో ఈ నెల 13న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన చేపూరి యశోద కుటుంబానికి సోమవారం దుస్తులు, నిత్యావసర సరుకులను అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పైతరి స్వామి అందజేశారు. అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు అశోక్, సుమన్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..



పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు విజయ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, రహ్మతుల్లా, రహ్మాన్, శివాజీరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ విరాళం



భిక్కనూరు: తిప్పాపూర్‌లోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వరాలయ అభివృద్ధికి బస్వాపూర్ గ్రామానికి చెందిన మద్ది లింగం కుమారుడు ఎన్‌ఆర్‌ఐ మద్ది వినయ్ కుమార్ రూ.11,116లను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతను శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరమ్ మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, సర్పంచ్ స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి సోమవారం క్రిష్టాజివాడి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ పుస్తకాలను విరాళంగా అందజేశారు. పోటీ పరీక్షలకు సంబంధించిన రూ.3 వేల విలువ గల పుస్తకాలను గ్రంథపాలకుడు రాజలింగంకు అందజేశారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

నస్రుల్లాబాద్(బీర్కూర్): అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో దళిత రత్న అవార్డు పొందిన దళిత హక్కుల పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు అయ్యాల సంతోష్‌ను సోమవారం బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులను చైతన్యం పరుస్తూ పేదవారికి అండగా ఉంటూ నిస్వార్థంగా పని చేయాలన్న అంబేడ్కర్ ఆశయాలను నిలబెట్టాలన్నారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్: పట్టణంలో 18 వార్డు కాంగ్రెస్ పార్టీ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షుడిగా నాగుల నర్సింలు, ఉపాధ్యక్షుడిగా నజీర్, యువజన విభాగం అధ్యక్షులుగా ఫిరోజ్ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు కారంగుల అశోక్ రెడ్డి, తదితరులున్నారు.

ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు

బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తెలిపారు. సోమవారం బస్టాండ్‌లో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం సదాశివ్, స్టేషన్ మేనేజర్ ఉన్నారు.

వరి పంట పొలాల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): తున్కిపల్లి శివారులో సాగవుతున్న వరి పంట పొలాలను సోమవారం క్లస్టర్ ఏఈవో మధుసూధన్ పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రుద్రారంలో ఉపాధి హామీ పనులను ఎంపీపీ మాధవి సోమవారం ప్రారంభించారు. వేసవిలో పనులు లభించని కారణంగా ప్రభుత్వమే ఉపాధి కల్పిస్తున్నదన్నారు.

నర్సన్నపల్లిలో..

కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లిలో ఉపాధిహామీ పనులను సర్పంచ్ ద్యాప హన్మాండ్లు ప్రారంభించారు. కార్యదర్శి నవనీత, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

కృష్ణాజివాడిలో ఇంటింటికి తెలుగుదేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజివాడిలో సోమవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో టీడీపీ హయాంలో అమలు చేసిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్లారెడ్డి నియోజక వర్గం కోఆర్డినేటర్ మహేష్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు.

'ఆరోగ్య మహిళ'ను వినియోగించుకోండి

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ పీహెచ్‌సీలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి శ్రీలేఖ తెలిపారు. చికిత్స అనంతరం మందులు అందిస్తామన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలోని పదవ వార్డులో కొత్త విద్యుత్ స్తంభాలను సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు పాత వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు. సర్పంచ్ పోతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ పాల్త్య విఠల్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓండ్ల యశోద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పెర్క శ్రీనివాస్, తదితరులున్నారు.

కొత్తసాయిబాబా గుడి పంతులు మృతి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి సాయిసద్గురు కాలనీ కొత్త సాయిబాబా గుడి పంతులు తిగుళ్ల శ్రీనివాస్‌రావు(68) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కాలనీ, పట్టణ వాసులు, భక్తులు చేరుకుని సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం దేవునిపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇళ్ల స్థలాల కోసం సంతకాల సేకరణ

కామారెడ్డి టౌన్: ఇళ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకుల నుంచి సంతకాలను సేకరించారు.

సమాచారం..

■ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

భిక్కనూరు: గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేసినట్లు కామారెడ్డి జిల్లా కన్వీనర్ మణి దీప్తి సోమవారం తెలిపారు. ఈనెల 29న నిర్వహించే ప్రవేశ పరీక్షను 30న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

■ నేడు మండల సర్వసభ్య సమావేశం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ యశోద నీలుపటేల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు.సమావేశానికి ఎమ్మెల్యే హన్మంత్ సింధే ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నట్లు ఆయన చెప్పారు.

■ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రాజంపేట: మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ అధికారులు రమేష్‌బాబు, సాలియ నాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ కొనసాగనున్నట్లు వెల్లడించారు.

■ అడ్లూర్ ఎల్లారెడ్డిలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

కామారెడ్డి టౌన్/సదాశివనగర్: రాష్ట్ర న్యాయసేవ సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో రైతుల కోసం మంగళవారం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని రైతు వేదిక ఎదుట అగ్రి లీగల్ ఎయిడ్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

■ 23న స్నేహ సొసైటీ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ది స్నేహ ఏ ట్రూఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కామారెడ్డి అమృతా గ్రాండ్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు సొసైటీ ప్రతినిధి పాక వెంకటి తెలిపారు. సమావేశానికి హాజరయ్యే వారు 9949849395 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కూలి గిట్టుబాటయ్యేలా పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కూలి గిట్టుబాటయ్యేలా ఉపాధి పనులు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. చీనూర్ శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఉపాధికూలీలతో మాట్లాడారు. కొలతలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మాల్తుమ్మెద నర్సరీలో మొక్కలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు సరేందర్, నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య ఉన్నారు.

ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

కామారెడ్డి టౌన్: బీబీపేట మండలం మాందాపూర్‌లో మే 6 నుంచి 9 వరకు జరిగే ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ ఉత్సవాలకు రావాలని కోరుతూ గ్రామ గౌడ సంఘం, ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ప్రభుత్వ విప్‌నకు ఆహ్వాన పత్రిక అందజేశారు. గౌడ సంఘం ప్రతినిధులు నాగరాజుగౌడ్, కిష్టాగౌడ్, వెంకట్ స్వామీ గౌడ్, రామాగౌడ్, నర్సా గౌడ్ పాల్గొన్నారు